## క్లుప్తంగా

### పుణ్యకోటి విమానంలో ఇంద్రవరదుడు



పుణ్యకోటి విమానంలో ఊరేగుతున్న స్వామివారు

**యాదమరి:** మండల కేంద్రమైన యాదమరిలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో స్వామివారు మంగళవారం రాత్రి పుణ్యకోటి విమానంలో పుర వీధుల్లో విహరించారు. స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### నేడు పుష్పపల్లకి సేవ

**యాదమరి:** మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం వేకువజాము నుంచి నిర్వహించే పుష్పపల్లకి సేవకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి స్వామివారి పల్లకికి సుగంధ పుష్పాలతో అలంకరిస్తున్నారు. విద్యుత్ దీపాలు అలంకరించి సర్వం సిద్ధం చేస్తున్నారు.

### గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

**ఐరాల:** మండలంలోని మట్టపల్లెలో గంగజాతర సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గంగమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

### నేడు గడపగడపకు మనప్రభుత్వం

**బంగారుపాళెం:** మండలంలోని గొల్లపల్లె పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు.

### ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

**చిత్తూరు అర్బన్:** ఆటో డ్రైవర్లు నియమ నిబంధనలను తప్పక పాటించాలని డీఎస్పీ శ్రీనివాసమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటాయించిన ఆటో స్టాండ్‌లో మాత్రమే పార్క్ చేసుకోవాలని, యూనిఫాం ధరించాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపరాదని సూచించారు. రికార్డులు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

### వైభవంగా అర్జున తపస్సు



కె.పట్నంలో వైభవంగా అర్జున తపస్మాను

**తవణంపల్లె:** మండలంలోని కె.పట్నంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో మహాభారత యజ్ఞం ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు హరిప్రసాద్ రెడ్డి అర్జున తపస్సు అవసరమైన పూజా సామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం కళాకారుడు భాస్కర్ అర్జునుడు వేషధారణలో భక్తితో తపస్సుమానును అధిరోహించారు. తపస్సు మాను శిఖరం నుంచి భక్తులకు నిమ్మకాయలు, బొరుగులు, వీబూదిపండ్లను విసిరారు. సంతానం లేని మహిళలు తడిబట్టలతో తపస్సుమాను దగ్గర సంతానం కోసం అర్జునుడిని వేడుకొన్నారు. అర్జునుడు మహిళా భక్తులకు నిమ్మపండ్లు అందజేశారు. ఆలయ ధర్మకర్తలు ఆర్. కృష్ణమూర్తిరెడ్డి, కార్యనిర్వాహకులు సిద్ధంపల్లె హరిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

# నగరంలో భూచోళ్లు

- చిత్తూరులో మళ్లీ కేటుగాళ్ల హస్తం
- వెలుగుచూస్తున్న నకిలీ పట్టాలు
- తహసీల్దార్‌కు ఫిర్యాదుల వెల్లువ

**కొన్ని నెలల క్రితం కొందరు భూ మాయ చేసి కోట్లకు పడగలెత్తి కటకటాలపాలయ్యారు. ఇది మరువకేముందే తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి బుక్కయ్యారు. అయినప్పటికీ ఒక్కొక్కటిగా నకిలీ పట్టాలు వెలుగుచూస్తున్నాయి. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదుల పరంపర మొదలైంది. ఇదంతా ఆ నాలుగు ముఠాలు చేస్తున్నట్లు అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ డూప్లికేట్ గ్యాంగ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలని అధికారులు వేట మొదలుపెట్టారు.**



చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరం మిట్టూరులోని తహసీల్దార్ కార్యాలయం పరిధిలో 14 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వివిధ సమస్యల నిమిత్తం ఇక్కడికి నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. దీన్ని ఆసరా చేసుకుని ఇక్కడ కొన్నాళ్లుగా దళారీ వ్యవస్థ ఆజ్యం పోసుకుంది. టీడీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం వీరు కార్యాలయ ఆవరణలో పెత్తనం చేశారు. అప్పట్లో పలు ఇళ్ల పట్టాలను సైతంగా ఇష్టారాజ్యంగా మంజూరు చేశారు. ఫోర్జరీ సంతకాలు చేయించి తప్పుడు పత్రాలు పుట్టించారు. దీంతో అప్పటి నుంచి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎలా చేస్తారంటే...**

రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిల్లో దళారీలు ఒక ముఠాగా ఏర్పాటయ్యారు. వీరు అధికారుల కళ్లు గప్పి పట్టాలను మార్చేసి, ఈ ప్రతాలకు జీవం పోస్తున్నారు. వాటిని డాక్యుమెంట్ రైటర్లుగా వ్యవహరించే కొందరు పకడ్బందీగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అధికారులతో పనిలేకుండా తప్పుడు పత్రాలతో డీకేటీ భూములు, గ్రామనత్తం, పొరంబోకు, వంక భూములకు సైతం పట్టాలు చేయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇలాంటివి కొన్ని పట్టుబడగా, మరి కొన్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ఈ రకమైన దందా గుట్టుచప్పుడు కాకుండా నడుస్తోంది. ఇందుకు భూమిని బట్టి రూ.లక్షల్లో మూల్యం చెల్లించుకుంటున్నారు. నలుదిక్కులా నాలుగు ముఠాలు పాగా వేసి ఈ దందాను నడిపిస్తున్నట్లు అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద ఈ కేటుగాళ్లు కాసుకుని కూర్చున్నారన్న చర్చ సాగుతోంది.

**ఫిర్యాదులు వస్తున్నాయి**

డూప్లికేటుగాళ్లు గుట్టుగా అనుమానం రాని భవనాల్లో గదులు అద్దెకు తీసుకుని భూ దందాలు నడిపిస్తున్నట్లు సమచారం ఉంది. అమాయక ప్రజలను టార్గెట్ చేసి ఈ మోసాలకు తెరతీస్తున్నారు. ఎక్కువగా చిత్తూరు నగర పరిధిలోనే ఇలాంటి దందాలు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడితే పోలీసులకు అప్పగించాలన్న ప్రయత్నాల్లో ఉన్నారు. పాత ఇళ్ల పట్టాల విషయంలో బోగస్ పత్రాలను కట్టడి చేయాలని చూస్తున్నారు.

**వీఆర్‌ఓలకు వెన్నుపోటు**

కొంత మంది వీఆర్‌ఓలకు కంప్యూటర్ నాలెడ్జ్ లేదని, అక్షరాలు రాయడం రాదని ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. వారి చేతికి లాగిన్, రబ్బరు స్టాంపులు ఇచ్చేశారు. ఏ పని జరగాలన్న వీరే కీలకంగా మారారు. ఇలా కొన్ని పనులు నేర్చుకున్న ప్రైవేటు వ్యక్తులు వీఆర్‌ఓలను వదిలి కొంప ముంచే పనులు చేస్తున్నారు. పత్రాలను మార్చడంతో పాటు వీఆర్‌ఓ, ఆర్ఐ, తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారు. దళారుల ముఠాల్లో సభ్యులుగా చేరి అచ్చుగుద్దినట్లు సంతకాలు ఫోర్జరీ చేసేస్తున్నారు. దీంతో కార్యాలయాల్లో అనుమానాలు రాకుండా పనులు జరిగిపోతున్నాయి.

**ఇదిగో సాక్ష్యం...**

కొన్ని భూ లావాదేవీల వల్ల ఓ వీఆర్‌ఓకు ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఉన్నత చదువు చదివాడని, కంప్యూటర్ చదువుందని ఆ వీఆర్‌ఓ అతడిని అనుచరుడిగా పెట్టుకున్నాడు. ఏ పని జరగాలన్న అప్పట్లో అతని ద్వారానే చేస్తూ వచ్చాడు. అతను పలు పట్టాల్లో పేర్లు మార్చి మధ్యవర్తిత్వం చేసేవాడు. లాభాపేక్షమైన పనులను సునాయసంగా చేసేవాడు. దీంతో వారి మధ్య బంధంగా మరింత బలపడింది. దీంతో అతను ఏకంగా వీఆర్‌ఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి పత్రాలు సృష్టించడం మొదలుపెట్టాడు.

- పెరుమాళ్లకండ్రిగలో 2021లో ఓ పట్టాభూమిని ఫోర్జరీ సంతకాలతో మార్చేశారు. అయితే అవి తప్పుడు పత్రాలు అని గుర్తించిన బాధితులు అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేశారు.
- మండలంలో పదిమందికి సంబంధించిన గ్రామ కంఠం భూమిని ఓ వీఆర్‌ఓ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కాడు. దీంతో కదిలిన యంత్రాంగం రిజిస్ట్రేషన్ రద్దు చేయించింది.
- చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని పలు ఇంటి పట్టాలను 2019 వరకు ఇష్టానుసారంగా మార్చేశారు. మార్చిన పట్టాలు ఇటీవల అధికారుల దృష్టికి రాగా అవి తప్పుడుపత్రాలు అని కొట్టిపారేశారు. చివరకు అప్పటి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ అని నిర్ధారించారు.

**ఫిర్యాదు చేయండి**



తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. నాలుగు గ్యాంగులు ఉన్నట్లు తెలిసింది. వారు ఎలా చేస్తున్నారు? ఎక్కడ నుంచి నడిపిస్తున్నారు? వారు ఎవరెవరు? కార్యాలయంలో పనిచేస్తున్న వారికి, వాళ్లతో ఏమైనా లింకులు ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నాం. పూర్తి స్థాయిలో నిఘా పెట్టాం. మోసగాళ్ల నుంచి ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వ్యక్తులు కనిపిస్తే నేరుగా కార్యాలయంలో ఫిర్యాదు చేయండి.

– కిరణ్, తహసీల్దార్, చిత్తూరు

# కోలాహలంగా గంగమ్మ నిమజ్జనం





ఐరాల: నిమజ్జనానికి బయల్దేరిన అమ్మవారు, గుడిపాల: భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మ

**ఐరాల:** మండల కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న గంగ జాతర బుధవారం సాయంత్రం అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. వానియంబాడి డప్పు వాయిద్యాలు యువతను అలరించాయి. అమ్మవారిని నగిరిలోని కుంటలో నిమజ్జనం చేశారు.

**వేడుకగా పరదరామి గంగమ్మ జాతర**

**యాదమరి:** ఆంధ్ర సరిహద్దు తమిళనాడులోని పరదరామిలో గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహించారు. పరదరామిలో వెలసిన గంగమ్మ ఆలయంలో బుధవారం ఉదయం అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో ఉన్న గ్రామీణ ప్రజలు అమ్మవారికి గజమాలలు సమర్పించి పొంగలి పెట్టి నైవేద్యం సమర్పించారు.

**గంగమ్మ వర్షాలు కురిపించమ్మా**

**గుడిపాల:** వర్షాలు కురిపించి, పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ బుధవారం మండలంలోని తిమ్మాపల్లె గ్రామస్తులు గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలిపోసి అమ్మవారికి అభిషేకాలు చేశారు. గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించి మహిళలు అంబలితో ఊరేగింపుగా వెళ్లారు. సాయంత్రం పొంగలి పెట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులు వారి మొక్కులను తీర్చుకున్నారు.

### నేడు పింఛన్ల పంపిణీ

**చిత్తూరు రూరల్:** చిత్తూరు మండలంలో గురువారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. వలంటీర్ల ద్వారా యథావిధిగా పింఛన్‌దారుల ఇంటి వద్దకే పింఛన్ నగదు అందిస్తారన్నారు. వారికి అందుబాటులో ఉండి లబ్ధిదారులు నిర్ణీత సమయంలోపు పింఛన్ పొందాలని ఆయన పేర్కొన్నారు.

### యోగాసనాలతో ఆరోగ్యం పదిలం

**కార్వేటినగరం:** యోగాసనాలతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఫిజికల్ డైరెక్టర్(పీడీ) దామోదరం అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ప్రతిఒక్కరూ యోగాసనాలపై ఆసక్తి పెంచుకుని శరీర దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పద్మాసనం, భుజంగాసనం, శీర్షాసనం, సర్వాంగాసనం, వజ్రాసనం వంటి ఆసనాలపై అవగాహన కల్పించి వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

# పొగాకుతో ప్రాణాలకు ముప్పు





బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, గుడిపాల: గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**బంగారుపాళెం:** పొగాకు నమలడం వల్ల ప్రాణాలకే ముప్పు అని తుంబకుప్పం పీహెచసీ వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని తగ్గువారిపల్లెలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, యువత సిగరెట్లు, బీడీలు, హన్స్, గుట్కా వంటి మత్తుకు అలవాటుపడి ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మరిచిపోరాదని సూచించారు. మత్తుపదార్థాలు, పొగాకు వంటి పదార్థాల వల్ల కలిగే చెడుప్రభావలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ మణి, సీహెచ్‌ఓ షమీమ్‌బేగం ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఎంఎల్‌పీహెచ్‌లు దిలీప్, పునీత్, ఏఎన్‌ఎంలు రోజారమణి ఆశావర్కర్లు పుణ్యవతి, లత పాల్గొన్నారు.

**పొగాకుకు దూరంగా ఉందాం**

**గుడిపాల:** పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సుకన్య ప్రజలకు పిలుపునిచ్చారు. హెల్త్‌అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గుడిపాలలో బుధవారం పొగాకు నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ పొగాకు తినడం వల్ల గొంతు, నోటి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురికావాల్సి ఉంటుందని చెప్పారు.



తవణంపల్లెలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

**మత్తుపదార్థాల వాడకం హానికరం**

**తవణంపల్లె:** మత్తు పదార్థాలు వాడకం ఆరోగ్యానికి హానికరమని తవణంపల్లె వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్ తెలిపారు. తవణంపల్లె పీహెచ్‌సీ నుంచి వైద్యాధికారులు, సిబ్బంది, ఆశావర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో సీహెచ్‌ఓ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, జయమ్మ, అమరావతి, శ్రీహరి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**పొగాకుతో జీవితమే నాశనం**

**యాదమరి:** పొగాకు వాడకం జీవితాన్నే నాశనం చేస్తుందని స్థానిక ప్రభుత్వ వైద్యులు అవగాహన కల్పించారు. మండలంలోని బుడితరెడ్డి పల్లెలో ప్రజలకు పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతుకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- ఆర్బీకేల ద్వారా రైతులకు 1680 క్వింటాళ్ల విత్తనాలు

**పూతలపట్టు:** రైతుల పక్షపాతిగా, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల వ్యవసాయ శాఖాధికారులతో కలిసి రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదివరకే పేర్లు నమోదు చేసుకున్న రైతులకే విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాశాఖాధికారి మధురవాణి అన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి మండలంలోని రైతులకు 1,680 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల కాయలు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం పాలకూరు, తలపులపల్లి ఆర్బీకేలలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మాసిలామణి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

**నేడు తవణంపల్లెలో..**

**తవణంపల్లె:** వేరుశనగ విత్తనాలను గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం దగ్గర పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వివరించారు. దీనికి ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాధవరంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేష్‌బాబు

**రైతులందరికీ అందిస్తాం**

**యాదమరి:** మండలంలోని రైతులందరికీ వేరుశనగ విత్తనాలు అందిస్తామని ఎంపీపీ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని మాధవరం సచివాలయ పరిధిలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురుస్తున్నందున రైతులందరూ సకాలంలో సాగు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన దుర్యోధన వధ



మట్టితో చేసిన దుర్యోధనుడి ప్రతిమ, తలపడుతున్న కళాకారులు

**గుడిపాల:** వసంతాపురం గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. దుర్యోధనుడి ప్రతిమను బంకమట్టితో తయారుచేసి దుర్యోధన, భీముడి పాత్రధారులు ఆలపించిన పద్యాలు అలరించాయి. అనంతరం బంకమట్టి కోసం జనం ఎగబడ్డారు. అనంతరం మహాభారత హరికథలో దుర్యోధన ఘట్టాన్ని భాగవతారిణి నాగమణి భక్తులకు ఆకట్టుకునేలా వినిపించింది. అనంతరం దుర్యోధనుడికి కర్మక్రియలు నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



# పౌరులు తమ హక్కులను పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

**పూతలపట్టు:** సమాజంలోని పౌరులు తమహక్కులను పొందాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని వడ్డేపల్లి హరిజనవాడలో బుధవారం పౌర హక్కు చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బడిఈడు పిల్లలు పనిలో కాకుండా బడిలోనే ఉండాలని తెలిపారు. ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ యువకులు మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని యువకులకు సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తెలిపారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రులు ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విరబూసిన మే పుష్పం



**ఐరాల:** మండలంలోని కామినేని పల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మనోహర్ ఇంట్లో మే నెల చివరి రోజున మే పుష్పం విరబూసింది. సాధారణంగా ఏప్రిల్ చివరి వారంలో మొగ్గ తొడిగి మే మొదటి వారంలో వికసిస్తాయి. అయితే ఈ సంవత్సరం మే చివరి రోజున పుష్పం విరబూసింది.

# ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**వడమాలపేట :** అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు ఆగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**పెద్దశేషవాహనంపై శ్రీనివాసుడు**

బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు రాత్రి పెద్ద శేషవాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి స్వామివారు మాడవీధుల్లో విహరించి భక్తులను కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు